# సులభ వాణిజ్య విధానంలో
# రాష్ట్రానికి అగ్రస్థానం

- 190 అంశాలను విశ్లేషించిన డీఐపీపీ
- తెలంగాణకు 53.71శాతం మార్కులు
- టీఎస్ఐపాస్‌తో విప్లవాత్మక మార్పులు
- ఫలిస్తున్న మంత్రి కేటీఆర్ కృషి

**న్యూఢిల్లీ, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

సులభ వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో ఇప్పటివరకు తెలంగాణ తొలి స్థానంలో నిలిచింది. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయా రాష్ట్రాలు అమలుచేస్తున్న విధానాలను విశ్లేషించి ర్యాంకులు ఇవ్వడం కోసం కేంద్రప్రభుత్వంలోని పరిశ్రమల పాలసీ ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) 340 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రాష్ట్రాలకు అందజేసింది. అన్ని రాష్ట్రాలు ఇచ్చిన సమాధానాలను విశ్లేషించే ప్రక్రియను డీఐపీపీ సంయుక్త కార్యదర్శి శైలేంద్రసింగ్ నేతృత్వంలోని కమిటీ మొదలుపెట్టి.. బుధవారం నాటికి 190 సమాధానాలను విశ్లేషించింది. ఇందులో తెలంగాణ 53.71% మార్కులను సాధించి, తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే వినూత్నంగా, ఆదర్శంగా నిలిచేలా రూపొందించిన టీఎస్ఐపాస్ అద్భుత ఫలితాలను సాధించి, కేంద్రాన్ని సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. 53.69% మార్కులతో ఉత్తరాఖండ్ రెండవ స్థానంలో నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను కాపీ చేసిన ఏపీ 52.94% మార్కులతో మూడవ స్థానానికి పడిపోయింది. డీఐపీపీ ఈ ప్రక్రియను ఈ నెల చివరికల్లా ముగించనుంది. ఆగస్టులో ఉత్తమ రాష్ట్రాన్ని ప్రకటిస్తుంది. సరళతర వ్యాపార నిర్వహణలో ఉత్తమ ర్యాంకు సాధించిన రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**నిరూపించుకొంటున్న తెలంగాణ**

తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన అనతి కాలంలోనే తనను తానుగా నిరూపించుకుంటున్నది. రాష్ట్ర సాధన సమయంలో తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన వారికి తగిన సమాధానం చెప్పేలా దేశంలోనే ఉత్తమ విధానాలతో దూసుకుపోతున్నది. తాజాగా సులభ వాణిజ్య విధానంలో దేశంలోనే అగ్రస్థానం సాధించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. దేశంతోపాటు ప్రపంచదేశాలు

(మిగతా 9వ పేజీలో)

# సులభ వాణిజ్య విధానంలో రాష్ట్రానికి అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

సైతం మెచ్చుకునేలా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మార్గదర్శకత్వంలో తీసుకొచ్చిన టీఎస్ఐపాస్.. పారిశ్రామికవేత్తల ప్రశంసలు అందుకోవడంతో పాటుగా ఈవోడీబీ ర్యాకింగ్‌లో కీలక పాత్ర పోషించింది. రాష్ట్రాన్ని పరిశ్రమల స్థాపన కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్న ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీ రామారావు నిత్య సమీక్షలు, ఆదేశాలు, సూచనలు ఈవోడీబీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలువడానికి కారణమయ్యాయి. గతేడాది తెలంగాణ 13వ ర్యాంకులో ఉన్నది. దీనిని మెరుగుపర్చే దిశగా విశేష కృషి చేసిన మంత్రి కేటీఆర్.. పరిశ్రమల శాఖ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండు వారాలకోసారి సమీక్షించారు. దీంతో పాటుగా హైదరాబాద్ నగరాన్ని లివబుల్ సిటీగా తీర్చిదిద్దడం, హాట్ కేకులుగా మారిన కార్యాలయ స్పేస్, రిజిస్ట్రేషన్ శాఖ అదాయం గణనీయంగా పెరగడం కూడా ఫస్ట్ ర్యాంక్ సాధించడంలో కీలక భూమిక పోషించినట్లు తెలుస్తున్నది. రాష్ట్రంలో పరిశ్రమల అనుమతులకు అనుసరిస్తున్న విధానాన్ని ప్రధాని నరేంద్రమోదీ సైతం ప్రశంసించారు. టీఎస్ఐపాస్ విధానం గత జూన్‌లో అమల్లోకి వచ్చింది. అప్పటినుంచి ఇప్పటివరకు రూ.38వేల కోట్ల పెట్టుబడులతో 2130 కంపెనీలు రాష్ట్రంలో స్థాపించడానికి ముందుకొచ్చాయి. వీటిద్వారా రాష్ట్రంలో 1.20లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించాయి. రాష్ట్రస్థాయిలో రూ.35,928 కోట్ల పెట్టుబడులతో 338 కంపెనీలురాగా 86,271 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. జిల్లాస్థాయిలో రూ.2799 కోట్ల పెట్టుబడులతో 1792 కంపెనీలు రాగా వీటిలో 34,598 మంది ఉపాధి పొందుతున్నారు. మైక్రోమ్యాక్స్‌లాంటి కంపెనీ నిర్వాహకులు తమ కంపెనీకి వేగంగా అనుమతి వచ్చిన తీరు చూసి అశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో తమ యూనిట్‌ను స్థాపించడానికి అనుమతులకు 18 నెలల వరకు సమయం పట్టిందని, తెలంగాణలో ఆరు నెలల్లోనే యూనిట్ ఉత్పత్తులను సైతం ప్రారంభించామని బహిరంగంగా ప్రకటించారు. కేసీఆర్ మాటల ముఖ్యమంత్రి కాదు చేతల ముఖ్యమంత్రి అంటూ శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి తన అనుభవాన్ని వివరించారు. 23ఏండ్లలో కాని పనిని సంవత్సరంలోనే చేసి చూపించారని ప్రశంసించారు.

**విప్లవాత్మకం స్వీయ ధ్రువీకరణ..:** ఒకప్పుడు కంపెనీలు, పరిశ్రమలను స్థాపించాలంటే వాటి యాజమాన్యాలు అనుమతుల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఆ అవసరం లేకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే స్వీయ ధ్రువీకరణ ద్వారా 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నది. ఈ విధానంపై అమెరికాలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, కంపెనీల యజమానులు సైతం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడా ఈ విధానాన్ని చూడలేదంటూ ఇటీవల అక్కడ పర్యటించిన మంత్రి కేటీఆర్‌ను అభినందించారు. కాలుష్య నియంత్రణ మండలి గ్రీన్ క్యాటగిరీలో పరిశ్రమలకు వారంలో, ఆరెంజ్ క్యాటగిరీ పరిశ్రమలకు రెండు వారాల్లో, రెడ్ క్యాటగిరీ పరిశ్రమలకు మూడు వారాల్లో అనుమతులు ఇస్తున్నది. పీసీబీ అధికారులు పాటించిన ఈ విధానాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరించాలని కేంద్ర పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహకాల (డీఐపీపీ) శాఖ సూచించడం గమనార్హం. దీంతోపాటు ఇతర అనేక శాఖల్లో భారీగా సంస్కరణలు తీసుకొచ్చారు. వాణిజ్య పన్నుల శాఖలోనూ ఈవోడీబీ లక్ష్యాలను పూర్తిచేశారు. కంపెనీల నిర్వాహకులకు వాణిజ్య పన్నుల విషయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా కోర్టులను కూడా నోటిపై చేశారు. ఈ విధమైన కోర్టులు ఎక్కడా లేవని అధికారులు పేర్కొంటున్నారు. భూముల కొనుగోళ్లు, వాటిలో భవన నిర్మాణాలకు అనుమతులు కూడా ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నారు.

**Implementation Scorecard**

| RANK. | STATE | SCORE (%) |
|---|---|---|
| 1. | TELANGANA | 53.71 |
| 2. | UTTARAKHAND | 53.69 |
| 3. | ANDHRA PRADESH | 52.94 |
| 4. | JHARKHAND | 49.55 |
| 5. | RAJASTHAN | 47.35 |
| 6. | MADHYA PRADESH | 45.29 |
| 7. | PUNJAB | 36.47 |
| 8. | CHHATTISGARH | 32.15 |
| 9. | GUJARAT | 31.76 |
| 10. | HARYANA | 30.47 |

**అనువైన వాతావరణంతో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్:** హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి భాగంలో గతేడాదితో పోలిస్తే 55% ఆఫీస్ స్పేస్‌ను వివిధ కంపెనీలు లీజుకు తీసుకున్నట్లు ప్రముఖ రియాల్టీ కన్సల్టెన్సీ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తన నివేదికలో వెల్లడించింది. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 29లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆఫీస్ స్పేస్‌ను కార్పొరేట్ సంస్థలు లీజుకు తీసుకున్నాయి. హైదరాబాద్‌లో ఉన్న వ్యాపార అనుకూలతలు ఇందుకు కారణంగా రియాల్టీ కన్సల్టెన్సీ సంస్థ తన సర్వేలో తెలిపింది. హైదరాబాద్‌లో అద్దెలు తక్కువగా ఉండటం, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, రాష్ట్ర ప్రభుత్వ క్రియాశీలక నిర్ణయాలతో అంతర్జాతీయ సంస్థలు ఇక్కడే కార్పొరేట్ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి మొగ్గు చూపుతున్నాయి. నైట్ ఫ్రాంక్ సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో బెస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్‌ను గుర్తించింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, వసతులు, మౌలిక సదుపాయాలు ఉండటం దీని ప్రత్యేకతగా పేర్కొంది.

**భూములకు ధరలకు రెక్కలు:** కంపెనీలను స్థాపించడానికి స్వయంగా భూములను కొనుగోలు చేసేందుకు ఆయా సంస్థలు సిద్ధమవుతుండటంతో నగర శివారుల్లోని భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. ఇటీవల టీఎస్ఐఐసీ నిర్వహించిన భూముల వేలంలో ఎకరం రూ.29కోట్లు పలికింది. ఇతర ప్రాంతాల్లో భూములు సైతం హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. పారిశ్రామిక పార్కుల్లోని భూములకు సైతం భారీ డిమాండ్ ఉండటంతో కొత్త పారిశ్రామిక పార్కుల వైపు దృష్టి సారించారు.

**డీఐపీపీకి అందుబాటులో రాష్ట్ర అధికారులు:** ఆయా రాష్ట్రాలు పంపిన సమాధానాలను విశ్లేషించే ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగానే వాటిపై మరింత వివరణ అవసరాన్ని బట్టి ఆ రాష్ట్రాల పరిశ్రమ విభాగం ముఖ్య కార్యదర్శి, కమిషనర్ తదితర అధికారులను డీఐపీపీ సంయుక్త కార్యదర్శి, ఇతర అధికారులు అడిగి తెలుసుకుంటారు. తెలంగాణ పరిశ్రమల ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, కమిషనర్ మాణిక్‌రాజ్‌లు ఢిల్లీలోనే అధికారులకు అందుబాటులో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకంగా ఉన్న టీఎస్ ఐపాస్ విధానంలోని అంశాలు మరే రాష్ట్రానికీ వర్తించవని, కానీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లోని వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాపీ కొట్టిందని, దీనిపై ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ప్రస్తుతం విచారణ జరుగుతూ ఉన్నదని డీఐపీపీ సంయుక్త కార్యదర్శి శైలేంద్రసింగ్‌కు మాణిక్‌రాజ్ వివరించారు. ఈవోడీబీ ర్యాంకింగ్ ఆయా రాష్ట్రాలకు పెట్టుబడులను ఆకర్షించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రపంచం మొత్తం మీద మన దేశానికి ఈవోడీబీలో గతేడాది 142వ ర్యాంకు ఉండగా, ఈ ఏడాది అది 130వ స్థానానికి చేరుకుంది. మొత్తం 189 దేశాలకు ఈవోడీబీ ర్యాంకింగ్‌లు ఉన్నాయి. ఇదే ప్రాతిపదికన దేశంలోని రాష్ట్రాలను ప్రోత్సహించడానికి, పారిశ్రామిక విధానాల్లో సవరణలు చేసుకుని పెట్టుబడులను ఆకర్షించుకోడానికి అవకాశం కల్పించేలా కేంద్రం డీఐపీపీ ద్వారా అన్ని రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నిర్వహించి ర్యాంకింగ్‌లను ఇవ్వాలని నిర్ణయించింది.